క్లుప్తంగా

ఉపాధి పనులపై సమీక్ష

వంగర: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి ఉపాధి సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు రోజుకు రూ. 307 వేతనం అందేలా వారితో పనులు చేయించాలని సూచించారు.రెండు పూటలా పనులకు హాజరయ్యేలా చూడాలని, పనిప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని, నీడకోసం చలువ పందిళ్లు వేయించాలని చెప్పారు. ఉపాధి హామీ ఏపీఓ మర్రాపు సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి


రాంబాబు మృతదేహం

మెంటాడ: పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కుంటినవలసలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, వీఆర్ఓ శ్రీను తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొల్లి రాంబాబు సోమవారం వ్యవసాయ పొలానికి ఇద్దరు కూలీలు కొల్లి సింహాచలం, లోకారపు మురళీతో కలిసి ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్నారు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలు లు, ఉరుములతో వర్షం ప్రారంభమైంది. వీరి ట్రాక్టర్‌కు సమీపంలో పిడుగు పడడంతో కొల్లి రాంబాబు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీలు సింహాచలం, మురళీకి తీవ్రగాయాలు కావడంతో గజపతినగంలోని ఏరియా ఆస్పత్రి కి తరలించారు. రాంబాబు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

రేగిడి: ఖండ్యాం గ్రామంలో స్థానిక ఆయుర్వేద వైద్యశాల అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు. కీళ్ల, నడుము నొప్పితో బాధపడుతున్న వారికి తనిఖీలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య లతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద వైద్యంతో ఉపశమనం లభిస్తుందన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తొలేళ్లు


పూజలు చేస్తున్న సిరి సహస్ర ప్రదీప్ నాయుడు

బాడంగి: వాడాడ గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఘటాల తో మహిళలు ఊరేగారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ,చీరలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. గ్రామదేవత పండగకు పెద్దల ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, ఆమె భర్త ప్రదీప్‌నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఉపసర్పంచ్ గొట్టాపు రామారావు, స్థానిక నాయకులు తోటవాసు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరా..?

రాజాం: పలు రకాల పన్నులను ముక్కుపిండి వసూళు చేయడమే తప్ప, సమస్యలు పరిష్కారం కావడం లేదని మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడును పట్టణవాసులు పలువురు ప్రశ్నించారు. పట్టణంలోని గాయత్రీ కాలనీలో వేంకటేశ్వరనగర్‌కు చెందిన ప్రజలు కమిషనర్‌కు సోమవారం మెమోరాండం అందించారు. కాలనీలో గత పదిరోజులుగా చెత్త పేరుకు పోతోందని, చెత్తను తరలించేందుకు ఎవరూ రావడంలేదని ఆరోపించారు. రోడ్లు బాగోలేవని, మురుగు కాలువ వ్యవస్థ సక్రమంగాలేదని, మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. పన్ను బకాయిలను వడ్డీతో సహా కట్టాలని నోటీసులు ఇస్తే చెల్లించామని, ఇప్పుడు వసతులు సమకూర్చడం లేదని మండిపడ్డారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీవాసులు దాలయ్య, జె.ఎస్. నాయుడు, మధుసూధనరావు, పి.రాజు, కృష్ణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గతమెంతో ఘన కీర్తి...

- ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన శ్రీ రమణ సత్యానంద నిలయం (ఆశ్రమం)
- నేడు అక్కరకురాని ఆశ్రమం
- శిథిలావస్థకు చేరుకుంటున్న ఆశ్రమ భవనాలు, గృహాలు, ఆలయం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు


శిథిలావస్థకు చేరిన శ్రీ రమణసత్యానంద నిలయం


ఆశ్రమ ఆవరణలోని రామాలయం


మురుగునీటితో అధ్వానంగా తయారైన ఆశ్రమ భూమి

రాజాం సిటీ:

ఒకప్పుడు ఎంతో వైభవం కలిగిన ఆశ్రమం నేడు అక్కరకురాకుండా పోతోంది. వేలాదిమంది పేదల వివాహాలకు ఆశ్రయం కల్పించిన ఆశ్రమం ...నేడు శిథిలమై దీనావస్థలో ఉంది. పట్టించుకోవాల్సిన అధికారులు కినుకవహించడంతో ఆశ్రమానికి చెందిన విలువైన భూములు కుచించుకుపోతున్నాయి. వివరాల్లోకి వెలితే...రాజాం నగరపంచాయతీ పరిధి సారధి రోడ్డులో దేవదాయశాఖకు చెందిన శ్రీ రమణ సత్యానంద నిలయం (ఆశ్రమం) ఉంది. ఇది గతంలో గొప్ప ఆధ్యాత్మిక ఆశ్రమంగా పేరుగాంచిం ది. మండలంలోని మారెడుబాక గ్రామానికి చెందిన దుప్పలపూడి సత్యనారాయణ సారథి రోడ్డు సమీపంలోని పొలాల్లో ఈ ఆశ్రమాన్ని నిర్మించారు. 85 సెంట్లలో ఆశ్రమ భవనం, రామాలయం, కొంత భూమిలో తొమ్మిది ఇళ్లు నిర్మించారు. ఆశ్రమానికి 2.35 ఎకరాల భూమి కూడా ఉంది. ప్రారంభంలో ఈ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సభలు, హోమియో మందుల పంపిణీ, యోగ సిద్ధి కార్యక్రమా లు విరివిగా నిర్వహించేవారు. పేదల వివాహాలు కూడా ఇక్కడ జరిగేవి. ఆశ్రమ నిర్వాహకులు 25 ఏళ్ల క్రితమే మృతిచెందారు. అయితే అంతకు ముందే సంబంధిత ఆస్తులను దేవదాయ, ధర్మాదాయ శాఖకు ధారాదత్తం చేశారు. అప్పటి నుంచి ఆశ్రమాన్ని దేవదాయశాఖ అధికారులే పర్యవేక్షిస్తున్నారు. తొలుత ఆశ్రమం నిర్వహణ బాగున్నప్పటికీ కాలక్రమేణా అధికారులు చూపు సన్నగిల్లడంతో ఇక్కడి కార్యక్రమాలు తగ్గిపోయాయి. ఆశ్రమ భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

బిక్కు బిక్కుమంటూ...

ఆశ్రమానికి చెందిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో అధికారులు పట్టణంలో శిథిల నివాస గహాలను గుర్తించి వాటిలో నివాసం ఉండరాదని, ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని చెప్పారు. ఆ సమయంలోనే ఆశ్రమ గృహాలను పరిశీలించిన అధికారులు వీటిలో కూడా ఎలాంటి కార్యకలాపాలు చేయరాదని దేవదాయశాఖ అధికారులకు సూచించారు. అయినప్పటికీ దేవదాయశాఖ అధికారులు ఆ గృహాలను అలాగే విడిచిపెట్టారు. ప్రస్తుతం వాటిలో నివాసం ఉంటున్న కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నాయి. ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నాయి.

ఇప్పటికైనా మేల్కొంటే మంచిది

ఆశ్రమానికి చెందిన భూమి నిరుపయోగంగా ఉంది. ఈ భూమిలో గతంలోవ్యవసాయం చేసేవారు. ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో మురికి కూపంగా తయారైంది. పట్టణంలోని పలు నివాస ప్రాంతాల నుంచి మురుగునీరు ఇక్కడికి చేరుతుండడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా మారుతోంది. గతంలో కొంత భూమి ఆక్రమణలకు గురికావడంతో దేవదాయశాఖ అధికారులు గుర్తించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు కూడా జారీచేశారు. భూమి చుట్టూ కంచె వేస్తే ఆక్రమణలను నియంత్రించవచ్చని, భూమిని వినియోగంలోకి తీసుకువస్తే ఆశ్రమానికి ఆదాయం వస్తుందని పట్టణ వాసులు అంటున్నారు. అలాగే ఆశ్రమ భవనాలు, గృహాలకు మరమ్మతులు చేసి ఆశ్రమానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తాం

రమణ సత్యానంద ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తాం. ఆ ప్రాంతంలో ఉన్న గృహాల నుంచి వచ్చే అద్దెలు రామాలయ నిర్వహణకు వినియోగిస్తున్నాం. ప్రస్తుతం నిధుల కొరత ఉంది. ఆశ్రమ పరిధిలోని భూమిని పరిరక్షిస్తున్నాం. ఏటా గీతాజయంతి రోజున ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బి.వి.మాధవరావు, దేవదాయశాఖ ఈఓ, రాజాం

కోటలు దాటుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న శంబంగి తదితరులు

బొబ్బిలి: రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు కోటలు దాటుతోందని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి విడదల రజని అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా మాజీ మంత్రి, మహిళా నేత అని కూడా చూడకుండా అక్కడి సీఐ బి.సుబ్బనాయుడు దౌర్జన్యం చేయడం చూస్తే రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన ఎంత దాష్టీకానికి తెగిస్తోందో అర్థమవుతోందన్నారు. సీఐ గారూ ఏంటిది అని విడదల రజని ప్రశ్నించగా, ఎక్కువ మాట్లాడితే నీపైనే కేసు పెడతానని సీఐ దబాయిస్తున్న వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూసిన ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ దమన కాండను అర్థం చేసుకుంటున్నారన్నారు. ఓ మాజీ మంత్రిని నెట్టేసిన సంఘటనలు రాష్ట్రంలో ఇంతకుమునుపెన్నడూ చూడలేదన్నారు.

హామీలను విస్మరించడం దారుణం

అధికారంలోకి వస్తే మీకు అది చేస్తాం, ఇది చేస్తామని నోటికొచ్చిన వాగ్దానాలన్నీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు వాటిని అమలు చేయడం లేదు సరికదా, దౌర్జన్య పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. మహిళలు, యువత, రైతులు నిరుద్యోగులు కూటమి ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారా అని చూస్తున్నారనన్నారు. ప్రభుత్వం పథకాలను అమలు చేయకుండా ప్రశ్నించే వారి గొంతునొక్కడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ప్రభుత్వ దురాగతాలను ప్రజలు పరిశీలిస్తున్నారని, తగిన సమయం కోసం వేచి సూచిస్తున్నార న్నారు.వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దల సత్యనారాయణ,జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


సత్సంగంలో ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని దత్తపీఠంలో సోమవారం దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో రోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించుకుంటే మంచిదని అన్నారు. ఆధ్యాత్మిక వక్తలు కిమిడి సూరపునాయుడు, గొర్లె దామోదరరావు, సామంతల దామోదరరావు, ఎస్.కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అభినందన


గౌరునాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రేగిడి: విజయవాడలో ఈనెల 5న నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మండలంలోని పెదలింగాలవలస గ్రామానికి చెందిన యువకుడు రెడ్డి గౌరునా యుడు స్వర్ణ పతకం సాధించాడు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు సోమవారం అంబకండి గ్రామానికి వచ్చిన రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ యువకుడు గౌరిగాయుడును సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే పలుగ్రామాలకు తారురోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్లకు రూ.4 కోట్లు మంజూర య్యాయని తెలిపారు. టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, పాలవలస రామచంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

14న హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 14న లెక్కించనున్నామని దేవదాయశాఖ ఈఓ బి.వి.మాధవరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించనున్నామని పేర్కొన్నారు.

సమ్మె నోటీసు

వంగర: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొంటారని మండల ఆశ వర్కర్ల సంఘం ప్రకటించింది. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.జ్యోతికి సోమవారం సమ్మె నోటీసు అందజేశారు.

భూ రీసర్వేకు సహకరించండి

తెర్లాం: భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం తెర్లాంలో కొద్ది రోజులుగా సర్వే చేపడుతున్నామని చెప్పారు. రైతులు తమ భూముల వద్ద ఉండి సర్వే సిబ్బందికి సరిహద్దులు చూపించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని తాటిపాడు, లచ్చన్నవలస, వావిలవలస తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఆ పథకం ఏపీఓ ఎస్. హరనాథరావు సోమవారం పరిశీలించారు. వేతనదారులకు పలు సూచనలు చేశారు. పనిప్రదేశంలో నీడ, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను ఆదేశించారు.

ఈకేవైసీ పూర్తిచేయాలి

బాడంగి: మండలంలో 9,198 మందికి ఈకేవైసీ అప్‌డేట్‌కాగా 2,972 మందివి ఇంకా పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహన డేటాకు ఆధార్ నంబర్ ఇచ్చి సీడింగ్ చేసుకోవాలని, ఇలాంటివి మండలంలో 416 వరకు ఉన్నట్లు చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బొబ్బిలి: పట్టణంలోని సంఘవీధి, చాకలి వీధి, బాపూజీ స్కూల్ ఏరియాలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం పరిశీలించారు. వీధులు, కాలువల్లోని పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

నవధాన్యాలతో భూసారం



నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని బొబ్బిలి వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు. ప్రీ మాన్‌సూన్‌డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో నవధాన్యాల సాగుపై బొబ్బిలి మండలం లోని మెట్టవలస గ్రామ రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో పాటు అపరాలు, నూనె గింజలు, జీలుగు, పిల్లిపెసర, జనుమ విత్తనాలను ఎకరానికి పది కిలోలు చల్లాలని సూచించారు. విత్తనాలను రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ కో–ఆర్డినేటర్ కె ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

పిరిడిలో తాగునీటి ఇబ్బందులు



పిరిడి గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకానికి సంబంధించిన కుళాయిల ద్వారా కొన్నాళ్లుగా నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. మంచినీటి పథకం పని చేయడం లేదన్న విషయం అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి కోసం గ్రామానికి దూరంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని హ్యాండ్ బోరును ఆశ్రయించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – బొబ్బిలిరూరల్

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్...


మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఈనెల 14వ తేదీన పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో తొలగించనున్నామని తహసీల్దార్ సులోచనరాణి తెలిపారు.మండల కేంద్రంలోని అంతరరాష్ట్ర కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, ఆర్‌అండ్‌బీ జేఈలు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామంటూ కొద్దిరోజుల క్రితం హంగామా చేశారు.అయితే ఆ తర్వాత ఒక్క అడుగూ ముందుకు పడకపోవడంతో 'అంతా ఆర్భాటమే' శీర్షికతో ఈ నెల 5వ తేదీన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ సులోచనరాణి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 27వ తేదీన నాతో పాటు సీఐ కె.నారాయణరావు ఎస్ఐ వి.ప్రసాదరావు,ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రణయతో కలిసి గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రతీ దుకాణాన్ని సందర్శించి ఆక్రమణలు తొలగించాలని దుకాణ యజమానులను ఆదేశించామన్నా రు.రోడ్డు ఎడ్జ్‌కు 15 నుంచి 20 అడుగుల వరకు రెడ్ మార్కు చేశామని, ఆ మార్కు ఉన్నంత వరకు ఆక్రమణలను తొలగించాలని చెప్పి దాదాపు రెండు నెలలవుతున్నా ఎవరూ స్పందించలేదన్నారు. బుధవారం లోపు ఎవరికి వారు స్వతహాగా ఆక్రమణలు తొలగించకుంటే తామే జేసీబీతో తొలగిస్తామని చెప్పారు. డీటీ గంగాధర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి


ఎంపీడీఓ రత్నంతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: వేసవి నేపథ్యంలో మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రత్నం, ఈఓపీఆర్డీ వెంకటరమణతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రతతో పాటు తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్వహణను తరచూ పరిశీలించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సవరణలపై సూచనలివ్వండి

బొబ్బిలిరూరల్: నియోజకవర్గంలో నూతన ఓటర్ల జాబితా సిద్ధమైందని, వీటిని రాజకీయ పార్టీలు పరిశీలించి సవరణ ప్రక్రియలో సూచనలు ఇవ్వాలని ఎన్నికల డీటీ గౌరీశంకర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల నమోదు,బదిలీలు, సరళీకరణ, తదితర అంశాలపై చర్చించారు. జాబితాలో తప్పులున్నా, చేర్పులు,మార్పులు చేపట్టాల్సి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.హెచ్‌డిటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం


బొబ్బిలి పట్టణంలో నిర్వహించిన బుద్ధ పౌర్ణిమ వేడుకల్లో పట్టణ ప్రముఖులు


బొబ్బిలిరూరల్: కుసుకువానివలసలో బుద్ధుడి విగ్రహం వద్ద వేడుకల్లో జేసీరాజు తదితరులు

బొబ్బిలి: నేటి యువత,సమాజం బుద్ధుని బోధనలపై ఆకర్షితులు కావాలని, వాటిని అనుసరించి సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగా లని డీఎస్పీ జి.భవ్యా రెడ్డి సూచించారు.స్థానిక స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ పౌర్ణమిని నిర్వహించారు.గౌతమ బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రపంచంలో బుద్ధుని బోధనలను ఆచరించి గొప్ప స్థాయికి ఎదిగిన వారి గురించి వివరించారు. పట్టణ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలే శిరోధార్యం

బొబ్బిలిరూరల్: గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి,సామరస్యాలే నేటి సమాజానికి శిరోధార్యమని రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసి రాజు అన్నారు. కునుకువానివలసలో విశ్రాంత ఉపాధ్యాయుడు చప్ప అప్పలనాయుడు నిర్మించిన బుద్ధుడి విగ్రహం వద్ద సోమవారం బుద్ధ జయంతి నిర్వహించారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. దూపం వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


బొబ్బిలిరూరల్: గోకుల్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో వైద్యవిద్యార్థినులు


రాజాం సిటీ: వేడుకల్లో డాక్టర్ తలే రాజేష్


బాడంగి : సీహెచ్‌సీలో నర్సులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బొబ్బిలి రూరల్: పిరిడి గ్రామ సమీపంలోని గోకుల్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు కేక్ కట్ చేశారు. కళాశాల ఎండీ బొట్టా వెంకటరమణయాదవ్ దంపతులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

బాడంగి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో హెడ్ నర్సులు, నర్సులను బొబ్బిలి రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం సన్మానించారు. వైద్యాధికారులు శ్రీకాంత్, రేవతి ఉన్నారు.బొబ్బిలి రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్‌కు చెందిన డిస్ట్రిక్ట్ క్లబ్ జేసీ రాజు, కార్యదర్శి సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, పబ్లిక్ ఇన్‌చార్జ్ చైర్ కృష్ణమోహన్, చందు పాల్గొన్నారు.

సన్‌రైజ్ ఆస్పత్రిలో..

రాజాం సిటీ: స్థానిక సన్‌రైజ్ ఆస్పత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నర్సులు కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన సేవలందించడంతో కీలకపాత్ర నర్సులదేనని అన్నారు. కోవిడ్ వంటి కష్టకాలంలో కూడా నర్సులు ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. వైద్యులు డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

బాలభవన్ సందర్శన


బాలభవన్‌లో పిల్లలతో మాట్లాడుతున్న సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ఎస్ రాజు

రాజాం: పట్టణంలోని బాలభవన్‌ను విశాఖపట్నం ఐసీఆర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ఎస్.రాజు, సీనియర్ టీచర్ ఎస్.పద్మజారాజు సోమవారం సందర్శించారు. బాలభవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను పరిశీలించి, పలు కళలు నేర్చుకుంటున్న చిన్నారులను అభినందించారు. వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకోవడంపై అభినందించారు. వారి వెంట బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ ఉన్నారు.